జయహో షార్



బుచ్చిరెడ్డిపాళెం : శ్రీహరికోట నుంచి ప్రయోగించిన వందో రాకెట్ విజయవంతం కావడంతో రామచంద్రాపురం ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు బుధవారం హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు విద్యార్థులు 100 ఆకారంలో కూర్చొని, జయహో షార్ అంటూ నినదించారు. అనంతరం షార్ శాస్త్రవేత్తకు అభినందనలు తెలిపారు. ఉపాధ్యాయుడు గండికోట సుధీర్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఉద్యానాధికారికి సన్మానం



పొదలకూరు : గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఉద్యానాధికారి ఈ.ఆనంద్ పురస్కారం అందుకున్న సందర్భంగా పొదలకూరు కార్యాలయంలో బుధవారం ఉద్యోగులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆనంద్‌కు శాలువ కప్పి అభినందనలు తెలిపారు.

మహాత్మునికి కళా నివాళి



గాజు సీసాపై బాపూజీ చిత్రం

ముత్తుకూరు : మండలంలోని నారికేళపల్లి పంచాయతీ, సుబ్బారెడ్డిపాళెం యూపీస్కూల్ తెలుగు పండిట్ సోమా పద్మారత్నం బుధవారం గాజు సీసాపై జాతిపిత మహాత్మాగాంధీ చిత్రాన్ని రూపొందించారు. గురువారం బాపూజీ వర్ధంతి, అమరవీరుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ చిత్రాన్ని ఆవిష్కరించి, అంజలి ఘటించారు.

నిర్లక్ష్యాన్ని సహించను



సోమిరెడ్డికి వినతి పత్రాలు ఇస్తున్న ప్రజలు

మనుబోలు : విధి నిర్వహణలో సచివాలయ ఉద్యోగుల నిర్లక్ష్యాన్ని సహించబోనని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. మనుబోలులోని సీఆర్ఆర్ కల్యాణ మండపంలో ప్రత్యేక ప్రజా విజ్ఞప్తుల పరిష్కార వేదికలో ఆయన బుధవారం పాల్గొని ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఫిబ్రవరి 15లోపు ప్రతి ఉద్యోగి వారి పరిధిలో లబ్ధిదారులను గుర్తించాలన్నారు. తహసీల్దార్ సుబ్బయ్య, ఎంపీడీఓ జలజాక్షి తదితరులు పాల్గొన్నారు.

పరిశోధనల జాడేదీ?

- నీటి లభ్యత లేక వర్షాధార పంటల సాగు
- కొత్త వంగడాలపై పరిశోధనలు నిలిపివేత

పొదలకూరు పరిసర ప్రాంతాలైన రాపూరు, చేజర్ల, కలువాయి, సైదాపురం, మనుబోలు తదితర మండలాల్లో మెట్టపంటల సాగు అధికంగా ఉంటుంది. అపరాల సాగు ఉన్న ప్రాంతంలో మెట్ట వంగడాలపై పరిశోధనలతో పాటు, కొత్త వంగడాలను కనుగొనేందుకు ఇక్కడ పరిశోధనా స్థానాన్ని ఏర్పాటు చేశారు. అయితే నిర్దేశిత లక్ష్యాలు కొంతవరకు నెరవేరినా తర్వాత వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల నిర్వహణకే పరిశోధనా స్థానం పరిమితమైంది.



చిరుధాన్య వ్యవసాయ పరిశోధనా స్థానం

పొదలకూరు : మూడున్నర దశాబ్దాల క్రితం పొదలకూరు ప్రాంత వరప్రసాదినిగా పేరు తెచ్చుకున్న చిరుధాన్య పరిశోధనా స్థానం ప్రస్తుతం ప్రయోగాలు లేక వెలవెలపోతోంది. నీటి లభ్యత లేకపోవడం వల్లే ఇక్కడ పరిశోధనలు జరగకపోవడానికి ప్రధాన కారణంగా శాస్త్రవేత్తలు అంటున్నారు. ఇక్కడ కొత్త వంగడాలపై పరిశోధనలు జరిగి సుమారు రెండు దశాబ్దాలు దాటింది.

తొలినాళ్లలోనే ప్రయోగాలు

పొదలకూరులో సుమారు 13 ఎకరాల్లో పరిశోధనా స్థానంలో ఉంది. ప్రస్తుతం వర్షాధారంగా మినుము, పెసర, కంది, మొక్కజొన్న తదితర పప్పు ధాన్యాలను రైతుల క్షేత్ర సందర్శన, విత్తనాలు, విద్యార్థినుల ప్రాక్టికల్స్ కోసం పండిస్తున్నారు. పరిశోధనా స్థానం ఏర్పాటు చేసిన తొలినాళ్లలో పొదలకూరు జొన్న పేరుతో కొత్త వంగడాన్ని కనుగొన్నారు. అయితే జొన్న సాగు కాలానుగుణంగా దాదాపుగా అంతరించిపోయింది. నిధుల లేమి, నీటి సౌకర్యం లేక ఇక్కడ పరిశోధనలకు అడ్డంకిగా మారడంతో శాస్త్రవేత్తలు వ్యవసాయం చేసి నాణ్యత కలిగిన పంట దిగుబడులపైనే దృష్టి కేంద్రీకరిస్తున్నారు.

ప్రధాన ఉద్దేశం

పరిశోధనా స్థానంలో ప్రధానంగా అధిక దిగుబడులనిచ్చి.. వ్యాధులను తట్టుకునే తృణధాన్యాల వంగడాలను కనుగొనడం. వాటిని అభివృద్ధి చేసి పరిణామం చెందుతున్న వాతావరణానికి అనువైన విధంగా రైతులకు అందించడం. నూనె గింజల అభివృద్ధిలో భాగంగా వేరుశనగ రకాలను పరీక్షించడం, జొన్నలు, పొద్దు తిరుగుడు రకాలను సంకర జాతుల మూల్యాంకనం చేయడం, అధిక దిగుబడి, క్రిమీ తెగుళ్లు, వ్యాధులను తట్టుకోగల నల్లరేగడి, పచ్చిమిర్చి, కంది రకాలను అభివృద్ధి చేయడం, రబీ వర్షాధార పరిస్థితులకు అనువైన జొన్న రకాలను అభివృద్ధి చేయడం, జొన్న ఆధారిత పంట విధానాలపై పరిశోధన, వాతావరణాన్ని తట్టుకోగల వ్యవసాయ అభివృద్ధి తదితర అంశాలపై పరిశోధనా స్థానం శాస్త్రవేత్తలు పనిచేయాల్సి ఉంటుంది. అయితే ప్రస్తుతం ఇక్కడ పొలంలో సీజన్ల వారీగా పంటల సాగు చేపడుతున్నారు. దీనిద్వారా రైతులకు ఎరువులు, పురుగు మందులను తగు మోతాదులో వాడి అధిక ఫలసాయాన్ని దిగుబడి చేయడంలో మెళకువలను వివరిస్తున్నారు. దిగుబడి తగ్గినా నాణ్యమైన పంట దిగుబడి ఉండాలన్నది శాస్త్రవేత్తల ఉద్దేశంగా చెబుతున్నారు. ఏజీ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు క్షేత్రస్థాయిలో వ్యవసాయంపై అవగాహన పెంచుకునేందుకు వారితో పంటల సాగు చేయిస్తున్నారు. మినుము, పెసర, కంది సాగు చేస్తున్నారు.

ప్రత్యామ్నాయం కోసం అన్వేషణ

మెట్టరైతుల వ్యవసాయానికి ఎంతగానో ఉపయోగపడే పరిశోధనా స్థానంలో నీటి లభ్యత సమస్యగా ఉంది. అయితే దగ్గరలో ఎక్కడా కాలువలు లేకపోవడం వల్ల శాస్త్రవేత్తలు సైతం ఏమీ చేయలేని పరిస్థితిలో ఉన్నారు. పరిశోధనా స్థానానికి కిలోమీటర్ దూరంలో పొట్టేళ్ల కాలువ ఉన్నా అన్ని సీజన్లలో అక్కడి నుంచి నీటిని పంపింగ్ చేసుకునేందుకు పారుదల ఉండదు. అక్కడ బోర్లు నిర్మించుకుని పైపులైను ద్వారా పరిశోధనా స్థానానికి నీటిని మళ్లించుకునే ఆలోచన చేశారు. అయితే ఇప్పటి వరకు ఎలాంటి కార్యరూపం దాల్చలేదు.



శాస్త్రవేత్తలు సాగు చేస్తున్న మినుము పంట



శాస్త్రవేత్తలతో మాట్లాడుతున్న వీసీ (ఫైల్)

నీటికుంట ద్వారా పంటల సాగు



నీటికుంట

పరిశోధనా స్థానంలో నీటి లభ్యత తక్కువగా ఉండడం వల్ల శాస్త్రవేత్తలు నీటి కుంటలను నిర్మించారు. ఈ కుంటలు వర్షం కురిస్తే నిండి పంటలకు నీటిని అందించేందుకు ఉపయోగపడుతుంది. అంతేకాక బోర్ల ద్వారా కుంటలోకి నీటిని నింపుకోవడంతో పాటు పరిశోధనా స్థానానికి సమీపంలో ఉన్న వాటర్‌ప్లాంట్ నుంచి విడుదలయ్యే వృథా నీటిని పైపుల ద్వారా కుంటకు పెట్టుకున్నారు. దీంతో కుంటలో ఎల్ల వేళల నీరు ఉండడం వల్ల పంటలకు పెట్టుకునేందుకు వీలుకలుగుతోంది.

నీటి సమస్యలున్నాయి



పరిశోధనా స్థానంలో సాగు నీటి సమస్యలు ఉన్నాయి. దీనిని అధిగమించేందుకు ప్రయత్నిస్తున్నాం. ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషిస్తున్నాం. తాము పండించే పంటల దిగుబడిలో నాణ్యత సాధిస్తాం. వాటిని విత్తనాల కింద రైతులకు అందజేస్తాం. రైతులు పరిశోధనా స్థానానికి వచ్చి చీడపీడలపై సందేహాలను నివృత్తి చేసుకోవచ్చు.

– ప్రసన్న రాజేష్, ప్రధాన శాస్త్రవేత్త, ప్రిన్సిపల్, పొదలకూరు పరిశోధనా స్థానం

అధికార పార్టీలో ఆందోళన

- ఇద్దరు కౌన్సిలర్లను అజ్ఞాతంలోకి తరలింపు

బుచ్చిరెడ్డిపాళెం: ఫిబ్రవరి 3న జరుగనున్న బుచ్చి నగర పంచాయతీ వైస్ చైర్మన్ ఎన్నికల విషయమై అధికార పార్టీలో ఆందోళన నెలకొన్నట్లు తెలుస్తోంది. అందులో భాగంగానే ఇద్దరు కౌన్సిలర్లను వారి ఇళ్ల నుంచి అజ్ఞాతంలోకి తరలించినట్లు సమాచారం. వాస్తవంగా బుచ్చి నగర పంచాయతీ గత ఎన్నికల ముందు వరకు వైఎస్సార్‌సీపీ ఆధీనంలో ఉండేది. 20 వార్డులకు 18 వార్డుల్లో వైఎస్సార్‌సీపీ విజయం సాధించగా కేవలం రెండు వార్డుల్లో మాత్రమే టీడీపీ విజయం సాధించింది. అయితే 2024 ఎన్నికల తరువాత తొమ్మిది మంది వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు టీడీపీలో చేరడంతో నగర పంచాయతీ అధికార పార్టీ వశమైంది. ఈ నేపథ్యంలో ఇద్దరు ఉపాధ్యక్షుల గడువు ముగియడంతో ఖాళీలు ఏర్పడ్డాయి. వాస్తవంగా అధికార పార్టీలో ఇప్పటికే 11 మంది కౌన్సిలర్లు ఉండడంతో పాటు ఇద్దరు ఎక్స్ అఫిషియో సభ్యులు ఉన్నారు. అయినప్పటికీ టీడీపీ భయంతో ఇద్దరు కౌన్సిలర్లను అజ్ఞాతంలోకి తీసుకెళ్లడం రాజకీయ వర్గాల్లో చర్చగా మారింది.

కేంద్ర బృందం పరిశీలన



కొడవలూరు : కొడవలూరు పీహెచ్‌సీని డాక్టర్ రంగనాథ్, డాక్టర్ అక్షిత్ పురోహిత్‌లతో కూడిన కేంద్ర బృంద సభ్యులు బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా వారు కుష్ఠు సర్వేకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. అనంతరం కమ్మపాళెంలో పర్యటించి గ్రామస్తులతో మాట్లాడారు. కుష్ఠు సర్వేలో భాగంగా వైద్య సిబ్బంది ఇంటింటికీ వచ్చి పరిశీలించారా.. అని అడిగి తెలుసుకున్నారు. గ్రామస్తులతో సమావేశమై కుష్ఠుపై అవగాహన కల్పించారు. వారి వెంట అడిషనల్ డీఎంహెచ్‌ఓలు డాక్టర్ ఖాదర్‌వలీ, డాక్టర్ సురేంద్రబాబు, పీహెచ్‌సీ వైద్యాధికారి జి.బాలచంద్రబాబు ఉన్నారు.

ఎప్పుడూ అందుబాటులో ఉంటా



కార్యకర్తలకు నమస్కారం చేస్తున్న కాకాణి

పొదలకూరు : వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు అధైర్య పడొద్దని, ఎల్లప్పుడు అందుబాటులో ఉంటానని మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. పొదలకూరు పట్టణానికి చెందిన తన్నీరు చినమస్తానయ్య మృతిచెందడంతో ఆయన కుటుంబాన్ని బుధవారం కాకాణి పరామర్శించారు. ఈ సందర్భంగా కార్యకర్తలతో కాకాణి మాట్లాడారు. ఓడినా, గెలిచినా ప్రజలకు అందుబాటులో ఉంటానని, వైఎస్సార్‌సీపీ నాయకులు ధైర్యంగా ఉండాలన్నారు. ఎలాంటి సమస్య వచ్చినా అండగా ఉంటానన్నారు. అనంతరం పలువురు ఎన్నారైలతో చర్చించారు. ఉప సర్పంచ్ వాకాటి శ్రీనివాసులురెడ్డి, శివాలయం మాజీ చైర్మన్ తన్నీరు సుబ్రహ్మణ్యం, జి.వేణుగోపాల్‌రెడ్డి, ఆకులూరు హేమంత్, పి.శంకర్, వెంకీ, శ్రీనివాసులురెడ్డి, వెంకటేశ్వర్లుగౌడ్, ప్రసాద్, అమరా శివ, గోపీ, బాలకృష్ణ ఉన్నారు.

బాల్య వివాహాలు నేరం



మాట్లాడుతున్న వైద్యాధికారి నరసింహారావు

పొదలకూరు : బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని మహ్మదాపురం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ నరసింహారావు అన్నారు. మండలంలోని మహ్మదాపురం గ్రామ గిరిజన కాలనీలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బాల్య వివాహాలపై అవగాహన సదస్సును బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చిన్న వయస్సులో వివాహాలు జరిపిస్తే బాలికలకు గర్భసంచి అభివృద్ధి చెందదని, దాని వల్ల బుద్ధిమాద్యంతో కూడిన పిల్లలు జన్మిస్తారన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఆదినారాయణమ్మ, ఆరోగ్య పర్యవేక్షకుడు శ్రీనివాసులు, నరసమ్మ, మహిళా పోలీస్ శ్రీలత, ఆరోగ్య సహాయకులు పెంచలమ్మ, సుశీల, అంగన్‌వాడీ కార్యకర్తలు ప్రమీలా, సుజాత, ఆశా వర్కర్ రత్నమ్మ, గ్రామ నాయకుడు సుధాకర్‌రెడ్డి, గర్భిణులు, బాలింతలు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతపై ప్రత్యేక దృష్టి



ముత్తుకూరులో ర్యాలీ చేస్తున్న మత్స్య కళాశాల విద్యార్థులు

ముత్తుకూరు : ప్రతిఒక్కరూ రోడ్డు భద్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని కృష్ణపట్నం సీఐ రవినాయక్ అన్నారు. రోడ్డు భద్రతా మాసోత్సవాల సందర్భంగా మత్స్యకళాశాల విద్యార్థులు, ప్రొఫెసర్లు బుధవారం బస్టాండ్ కూడలి వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఇందులో సీఐ పాల్గొని, మాట్లాడారు. మద్యం సేవించి వాహనాలు నడపడం, ఫోన్‌లో మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం అత్యంత ప్రమాదకరమన్నారు. అసోసియేట్ డీన్ డాక్టర్ బాలసుబ్రమణియన్, ఫిషరీస్ యూనివర్సిటీ ఆఫీసర్ డాక్టర్ మాధవన్, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ రఘునాథరెడ్డి, అసిస్టెంట్ ఇన్‌స్పెక్టర్ మల్లికార్జున్‌రెడ్డి, ఎస్సై విశ్వనాథరెడ్డి, పోలీసులు పాల్గొన్నారు.

ప్రమాణాలు పాటించాలి

రోడ్డు భద్రతా ప్రమాణాలు పాటిస్తే అనేక ప్రమాదాలను నివారించవచ్చని నేలటూరులోని ఎస్‌ఈఐఎల్ ఎనర్జీ ఆపరేషన్స్–మెయింటెనెన్స్ హెడ్ సునీల్ కుమార్ గుప్తా అన్నారు. రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా బుధవారం సంస్థ కార్మికులు, ఉద్యోగులు ప్లకార్డులు ధరించి నేలటూరులో ర్యాలీ జరిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రహదారి భద్రతా –జీవితానికి రక్ష అనే నినాదాన్ని గుర్తించుకోవాలన్నారు. అతివేగం, అలసటతో డ్రైవింగ్ చేయడం మానాలన్నారు. ప్రయాణ సమయంలో బాధ్యతగా వ్యవహరించాలన్నారు. వివిధ శాఖల ఉన్నతాధికారులు, సెక్యూరిటీ సిబ్బంది పాల్గొన్నారు.

నిబంధనలు పాటించాలి

మనుబోలు : వాహనదారులు రోడ్డు భద్రతా నిబంధనలను తప్పక పాటించాలని ఎస్సై శివరాకేష్ అన్నారు. రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా మనుబోలు మండల కేంద్రంలో మహిళా పోలీసులు, పీహెచ్‌సీ అధికారులు, సిబ్బందితో కలిసి బుధవారం మోటార్ బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం రోడ్డు భద్రతపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడపడం ప్రమాదకరమన్నారు. అలాగే అతివేగంగా వెళ్లడం, హెల్మెట్, సీటు బెల్టు లేకుండా వాహనాలను నడిపితే ప్రాణాలు పోయే ప్రమాదం ఉందన్నారు. పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ మోహిసినా సుల్తానా మాట్లాడుతూ ప్రమాదాలు జరిగిన వెంటనే క్షతగాత్రుడిని ఆస్పత్రికి చేర్చిన వ్యక్తికి ప్రభుత్వం ప్రోత్సాహం ఇస్తుందన్నారు.



ముత్తుకూరు : ఎస్‌ఈఐఎల్ ఎనర్జీ ఆధ్వర్యంలో..



మనుబోలు : హెల్మెట్ ధరించి ర్యాలీ చేస్తున్న పోలీసులు

పశువైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోండి

మనుబోలు : గ్రామాల వారీగా నిర్వహిస్తున్న పశువైద్య శిబిరాలను పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని మడమనూరు పశు వైద్యశాల డాక్టర్ షరీఫ్ కోరారు. మండలంలోని లింగారెడ్డిపల్లి గ్రామంలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పశువైద్య శిబిరాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ శిబిరంలో 244 పెద్ద పశువులు, 132 దూడలు, 112 గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందులను తాగించామని తెలిపారు. ఈనెల 31 వరకు శిబిరాలను ఏర్పాటు చేస్తామన్నారు. అనంతరం పశుపోషణ, వాటి ఆరోగ్య పరిరక్షణపై పాడి రైతులకు అవగాహన కల్పించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ శిబిరంలో పశువైద్య సిబ్బంది కల్యాణి, పవన్, సుధాకర్ పాల్గొన్నారు.

విశేష స్పందన

విడవలూరు : స్థానిక పశు వైద్యశాలలో బుధవారం నిర్వహించిన పశువైద్య శిబిరానికి విశేష స్పందన లభించిందని పశు వైద్యాధికారి డాక్టర్ పి.వాణిశంకర్ అన్నారు. ఈ సందర్భంగా దూడలు, గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందులను తాగించారు. అదేవిధంగా గర్భకోశ వ్యాధులు కలిగిన పశువులను గుర్తించి, నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది శోభన్, రాజశేఖర్, మాధురి, అమిత షాలిని, హర్షిత, నారాయణరావు, శ్రీనివాసులురెడ్డి, స్థానిక నేత పొన్నలూరు పురంధర్‌రెడ్డి పాల్గొన్నారు.



మనుబోలు : పాడిరైతులకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ షరీఫ్

పోతిరెడ్డిపాళెంలో..

కోవూరు : మండలంలోని పోతిరెడ్డిపాళెం గ్రామంలో పశువైద్య శిబిరాన్ని బుధవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పశువైద్యురాలు డాక్టర్ ప్రీతి సాల్మన్ మాట్లాడుతూ ఈ శిబిరంలో 75 గేదెలకు నట్టల నివారణ మందు, 52 దూడలకు నులి పురుగుల మందు వేశామన్నారు. గొర్రెలు, కోళ్లకు టీకాలు వేసినట్లు తెలియజేశారు. అలాగే చుండుగుంట గ్రామంలో వేగూరు పశు వైద్యురాలు షబానా పశువులకు వైద్య పరీక్షలు నిర్వహించారు.

పాత వంగల్లులో..

కొడవలూరు : మండలంలోని పాతవంగల్లులో బుధవారం ఉచిత పశువైద్య శిబిరాన్ని నిర్వహించారు. యల్లాయపాళెం పశువైద్యశాల ఆధ్వర్యంలో జరిగిన శిబిరాన్ని సర్పంచ్ బెజవాడ లక్ష్మీబాయి ప్రారంభించారు. ఈ సందర్భంగా పశువైద్యాధికారి జె.సురేష్‌బాబు 12 పశువులకు చూడు పరీక్షలు, ఆరు పశువులకు గర్భకోశ వ్యాధులకు వైద్యం చేయడంతో పాటు 130 పశువులకు జలగల మందు, 90 దూడలకు వ్యాధి నివారణ మందులు, 300 మేకలు, గొర్రెలకు డీవార్మింగ్ మందులు పంపిణీ చేశారు. జూనియర్ వెటర్నరీ ఆఫీసర్ పి.వెంకటేశ్వర్లు, వెటర్నరీ అసిస్టెంట్ కె.వెంకయ్య, పశుగణన సహాయకులు జి.రాఘవేంద్రకుమార్, డి.సుభాషిణి, టి.వెంకటరమణయ్య, స్థానిక నేతలు చిరుమామిళ్ల నళిని, కంచర్ల సుబ్బానాయుడు పాల్గొన్నారు.



విడవలూరులో..



కోవూరు : పోతిరెడ్డిపాళెంలో..



కొడవలూరు : పాత వంగల్లులో..

కామాక్షితాయి సేవలో ఏఎస్పీ




బుచ్చిరెడ్డిపాళెం : జొన్నవాడలోని మల్లికార్జున స్వామి సమేత కామాక్షితాయిని జిల్లా అడిషనల్ ఎస్పీ సౌజన్య కుటుంబ సమేతంగా బుధవారం దర్శించుకున్నారు. తొలుత ఆలయ ఈఓ శ్రీనివాసులురెడ్డి వారికి స్వాగతం పలికారు. అనంతరం స్వామి, అమ్మవారి శేషవస్త్రాలు, తీర్థ ప్రసాదాలు అతిథులకు అందజేశారు.

స్వచ్ఛతపై అవగాహన

బుచ్చిరెడ్డిపాళెం : మండలంలోని మినగల్లులో పంచాయతీ విస్తరణాధికారి నారాయణరెడ్డి ఆధ్వర్యంలో గ్రామాల స్వచ్ఛతపై అవగాహన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ప్రజలు తడి, పొడి చెత్తను వేరు చేసి పంచాయతీ సిబ్బందికి అందించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ పూజిత, కార్యదర్శి ఆంజనేయులు పాల్గొన్నారు.

మెప్మా బజార్ సందర్శన



బుచ్చిరెడ్డిపాళెం : పట్టణంలోని మెప్మా బజార్‌ను బుచ్చి చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ బుధవారం సందర్శించారు. చేతివృత్తుల ద్వారా తయారైన వస్తువులను చూసి అభినందనలు తెలిపారు. ఎంపీ శేషయ్య, కౌన్సిలర్ ప్రమీలమ్మ ఉన్నారు.

సేంద్రియ ఎరువులతో లాభదాయకం

- డీఏఓ సత్యవాణి



కొడవలూరు : కమ్మపాళెంలో వరి పంటను పరిశీలిస్తున్న డీఏఓ సత్యవాణి

కొడవలూరు : రసాయన ఎరువుల వాడకం తగ్గించి సేంద్రియ ఎరువులను వినియోగించడం వల్ల రైతులకు లాభదాయకమని జిల్లా వ్యవసాయాధికారిని(డీఏఓ) పి.సత్యవాణి సూచించారు. మండలంలోని కమ్మపాళెం, రేగడిచెలికల్లో జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమానికి బుధవారం ఆమె హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రసాయన ఎరువులు ఇబ్బడిముబ్బడిగా వాడడం వల్ల సాగు ఖర్చులు గణనీయంగా పెరిగి రైతులు లాభపడలేకపోతున్నారని చెప్పారు. కమ్మపాళెంలో వరి పంటను కాండం తొలుచు పురుగు ఆశించి ఉన్నందున నివారణకు తొలి దశలో వేప నూనె, క్లోరో పైరిపాస్ 50 శాతం ఈసీ మందును పిచికారీ చేసుకోవాలని చెప్పారు. ఏడీఏ ఎం.శేషగిరి రైతులంతా నానో యూరియా వాడకాన్ని అలవర్చుకోవాలని కోరుతూ డ్రోన్స్ ఆవశ్యకతను వివరించారు. కార్యక్రమంలో కోవూరు ఏడీఏ డి.సుజాత, ఏఓ లక్ష్మి, వీఏఏలు ఒ.సుజిత్, డి.నవీన్‌కుమార్, డి.శివజ్ఞాన పాల్గొన్నారు.

వేరుశనగలో విత్తన శుద్ధి ముఖ్యం

ముత్తుకూరు : వేరుశనగ సేద్యంలో విత్తన శుద్ధి చాలా ముఖ్యమని ఇందుకూరుపేట ఏడీఏ రాజ్‌కుమార్ అన్నారు. పంటపాళెం పంచాయతీలోని కోళ్లమిట్టలో బుధవారం జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో వేరుశనగ పంట పొలాలను ఆయన పరిశీలించారు. ఆత్మ పీడీ శివన్నారాయణ, కేవీకే కో–ఆర్డినేటర్ శివజ్యోతి, శాస్త్రవేత్త కిరణ్‌కుమార్, వ్యవసాయాధికారి జోత్స్నరాణి తదితరులు రైతులతో మాట్లాడారు. వేరుశనగలో మొక్కల సాంద్రతను నియంత్రించుకుని అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. సమగ్ర కలుపు యాజమాన్యంపై అవగాహన కల్పించారు. రైతుల సందేహాలకు సమాధానాలిచ్చారు.

అప్రమత్తంగా ఉండాలి

బుచ్చిరెడ్డిపాళెం : మామిడి పండు తెగుళ్లకు సంబంధించి రైతులు అప్రమత్తంగా ఉండాలని కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ డి.విజయ్‌కుమార్ నాయక్ అన్నారు. మండలంలోని రేబాల, దామరమడుగు రైతు సేవా కేంద్రాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మామిడి పండు తెగుళ్ల నివారణకు ప్రోపికొనజోల్ ద్రావణం ఒక మిల్లీలీటర్‌ను లీటర్ నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల ఏఓ సురేంద్రరెడ్డి, వీఏఏ పవన్‌కుమార్ పాల్గొన్నారు.



ముత్తుకూరు : వేరుశనగ పంటను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు